విధికృతము

శ్రీమతి అడపా సుగుణమణిగారు

భైరవీనదీప్రాంతమున 'జమరాల్' అను పల్లెఉంది. అందులో సుమారు రెండువందల ఇండ్లున్నవి. ఒకటి రెండు పెంకుటిండ్లుతప్ప, తక్కినవన్నీ పూరిండ్లే. ఆ రెంటిలో ఒకటి ప్రఫుల్లచంద్రుడను పెద్దభూస్వామిది. అతడు బంగాళీబ్రాహ్మణుడు. ఐశ్వర్యములోనూ, విద్యలోనూ, అతనికిమించిన చేయి మరొకటి ఆపల్లెలో లేదు. ఆగ్రామవాసులంతా అతన్ని గౌరవిస్తుంటారు. ఆఊరిలో, కలహములేవన్నా వస్తే తీర్పు కతని చెంతకు రావలసిందే. అతనిమాటకు వ్యతిరిక్తంగా నడిచేవ్యక్తి నొక్కనినైనను వ్రేలెత్తి చూపించలేము.

అతనిభార్యపేరు నారాయణి. ఆమె పూర్వాచార పరాయణ. అక్షరాభ్యాసమైనను ఎరుంగని అబల. ఆవిడ దైవభక్తి, పతిభక్తి, వితరణబుద్ధి, గల ఒప్పుల కుప్పే కాని ఆమెతల్లి ఆమెకు చిన్ననాటనుండి ఉగ్గుపాలతో నూరిపోసిన మూఢవిశ్వాసాలు, చాదస్తపు ఆచారాలు, నానాటికి ద్విగుణీకృతమైనాయి.

ప్రఫుల్లున కిదంటే తలనొప్పి. అందువల్ల నానాటికి వాళ్ల అన్యోన్యానురాగం క్షీణించింది. తుదకు సంసారంఅంటే అసహ్యంకూడా పుట్టింది. పాపం ఎన్నో విధాల ఆమె మనస్సును మఱల్పచూచేడు. కాని నిష్ప్రయోజనమయింది. ఇదంతా విద్యలేకపోవడం వల్ల వచ్చిన వింతపశుత్వం అనుకున్నాడు. ఎన్నోసార్లు "భగవంతుడా, నా కనుకూలదాంపత్యం ఇచ్చేవుకా" వని విధిని దూరేవాడు. అది వట్టి అరణ్యరోదనం అయింది.

సువర్ణ, నారాయణీ ప్రఫుల్లుల ఏకపుత్రి. సార్థక నామధేయ. రూపమునకు రతి. లేక లేక గలుగు సంతతి అవడంచేత తల్లిదండ్రులిద్దరూ అల్లారుముద్దుగా పెంచేరు. ఆమెకూడా తలలో నాలుకవలె మెలగుచుండేది.

నాడు పౌర్ణమి. చంద్రుడు షోడశకళాప్రపూర్ణుడై ఎల్లెడల పిండి ఆరబోసినరీతి వెన్నెలకాయుచున్నాడు. అనంతకోటి నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. కానీ, వాటి కాంతి చంద్ర తేజస్సుముందు మరుగుపడ్డది. మందమారుత మల్లనల్లన వీచుచున్నది.

నారాయణి దినమంతయు ఉపవాసమొనర్చి, రాత్రి పూజానంతరమున ఫలహారమొనర్చి, వాకిట వాలు కుర్చీలో కూర్చున్న భర్తకు తాంబూలము తీసుకవచ్చి, ఆ సమీపముననే ఉన్న వేదికపై కూర్చుంది. అప్పుడే 'టంగు టంగు'మని గడియారము తొమ్మిదిగంటలు కొట్టింది. అప్పటికే సువర్ణ గాఢనిద్రాపరవశ అయింది. నారాయణి ప్రసంగవశాత్తు "ఏమండీ, ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు. అమ్మాయికి యుక్తవయస్సొచ్చింది. ఇప్పటి కింకా పెండ్లిమాటే తలచరు. మీ కేంపోయింది. మిమ్మల్ని ఎవ్వరూ అడగరు. అడిగే అమ్మలక్కలందరుకూ సమాధానమిచ్చేసరికి నా బ్రతుకు తెల్లవారిపోతుంది. వచ్చిన సంబంధాలన్నీ తృణీకరించేరాయను. మీరు ప్రయత్నం మొదటికే చెయ్యరు. మరి పెండ్లి ఏలాగవుతుందండి? మీదే భల్లూకపు పట్టుగాని, భట్టు గ్రామసంబంధం కేమి లోటండీ? కుఱ్ఱవాడు రూపసి. ఎఫ్. ఏ. చదువుచున్నాడు. ఇంటికి అతనే అధికారి. సామాన్యస్థితి, తినతిండికి కట్టగుడ్డకు లోటులేదు గదా. మనఊరికి దగ్గరసాకూడాను. తరచుగా అమ్మాయి వస్తూపోతూ ఉండొచ్చు. లేదా మనం వెళ్లిరావచ్చు. ఏమంటారు? మాట్లాడరేం?"

అంతసేపూ భార్య వాగ్ధోరణి వింటూ, ఆమె అమాయికత్వం తలంచుకుంటున్న ప్రఫుల్ ఒక దీర్ఘనిట్టూర్పువిడిచి "ఏమో? ఈ సాంప్రదాయ మట్టి

బాగున్నట్లు నాకు తోచలేదు. వాళ్లు మర్యాదస్తుల వలె కనబడరు. అదిగాక ఇప్పు డేంతొందరవచ్చిందని నీకింత ఆందోళన? మనచిట్టితల్లి కింకా పండ్రెండేండ్లు దాటలేదు. అతిబాల్యవివాహాలు చేసినవారిగతి మనం కళ్లార చూస్తున్నాం కదా? అదిగాక నాకింకా అమ్మాయిని కలకత్తాపంపించి పెద్దచదువు చదివించా లనివుంది. ఆమెకు యుక్తవయస్సువచ్చి, ఏయువకు నైనను ప్రేమించినట్లు కనబడితే, మనం పెండ్లిచేద్దాం. ఆదే దాంపత్యం. మనకేం పదిమందిపిల్లలు పోకులాడేరు గనుక ఆబరువు దించుకోవాలన్న భయం. కూతురైనా కొడుకైనా ఆ మెఒక్కర్తెగా."

"చాల్లెండి. ఎవరైనా వింటే నవ్విపోయేరు. పిల్ల వయసు చెప్పుకోవడమట, పండ్రెండేండ్లు పెండ్లీడు కాదట. ఆడు దింకా చదువుకోవడచుట. మీ ఆలోచనలు మీకే చెల్లేయి. మీవంటి ప్రముఖులంతా బయలుదేరడంవల్లనే విధవవివాహాలు, విడాకులచట్టాలు, దిగ్విజయంగా సాగుతున్నాయి. మాలఇంగ్లీషుచదువు చదువుకొన్న వాళ్లకు మంచిబుద్ధు లెట్లావస్తాయి. అమ్మాయికి, ఈడువచ్చిందికదా. ఆ కాస్తపనీ పెళ్లికాకముందే మనయింట జరిగిందంటే సంఘంమింకా మనను బ్రతుకనిస్తుందీ. ఇరువంశముల వాళ్లం కలకాలంఏడ్చి చావవలసిందే. ఐనా ఇదేమిటండీ; లోకంలో ఎవరూ పిల్లలను కనలేదా? పెళ్లిళ్లు చేయలేదా? ఈ రాద్ధాంతసిద్ధాంతాలు ఎచ్చటనైనా నున్నదా? ఎప్పటికైనా ఆడపిల్ల మరొకఇంటికి వెళ్లవలసిందే. ఇప్పటికే ఊరివారంతా ఈ విషయమై చర్చ ప్రారంభించేరట. ఇంకా ఆలస్యంచేసేవంటే కొంప మునిగిందన్నమాటే."

"సంఘం నన్నేమి పోషించక్కరలే. వెలివేస్తే వేయనీ. ఊరి అమ్మలక్కలంతా చర్చచేసి నాలుకలు తెంపుకోనీ, తలలు పగులకొట్టుకోనీ, నా చిట్టితల్లి నిప్పటినుండీ దాస్యాని కప్పచెప్పలేను. నీవింక ఈ ప్రశంస ఎప్పుడూ తలపెట్టకు. పిల్లవివాహంబాధ్యతనాది."

ప్రఫుల్ "దాస్యాని కప్పచెప్పలే"నని అనడంలో అర్థంవుంది. క్రొత్తకోడ లింటికివచ్చిందంటే సరి, అత్తగారు పీడబడిమేస్తరు, తోటికోడండ్రు రాణులు, అవుతారు.

"ఏనాడు నా ముద్దుముక్కలు చేసారుగనుక. నే నెరుగనా మిమ్మల్ని." అని క్రోధముతో నారాయణి ఇంట్లోనికి వెళ్లిపోయింది. మరి కొంతసేపటివరకు ప్రఫుల్ల దక్లే వాలుకుర్చీలో కూర్చొని నీలాకాశం వంక ఏకధ్యానముతో చూచేడు. పైనేముంది? నక్షత్రా లతనివలె మినుమినుకుమని విచారిస్తున్నాయి. చంద్రుడు తనస్థితినిచూచి నవ్వుచున్నాడు.

-౨-

శశధరబాబు కలకత్తానివాసి. అతని గృహము రెండంతస్తులది. ఆయనకు హేమాంగిఅను అర్థాంగి కలదు. ఆ దంపతులకు ముప్వురుపుత్రులు.

ప్రఫుల్, అనివార్యములగు కారణాంతరములచే కలకత్తా వెళ్లవలసివచ్చింది. అచ్చట నెలలతరబడి ఉండవలసిన పనితగిలింది. తనస్నేహితుడగు శశధరుని ఇంటియందే ఉనికి. శశధరుడు తనకు ఆంతరంగిక మిత్రుడు. ఎన్నిదినము లాతని ఇంటియందున్నను తన కభ్యంతరంలేదు. హేమాంగికూడ అతనియెడ సోదా పద్ధతి నవలంబించలేదు. ప్రఫుల్లునకు హేమాంగి తోబుట్టువు కాకపోయినను 'అన్నయ్యా' అని సంబోధించడం అలవాటు.

ఒకనాడు సాయంకాలము ప్రఫుల్ ఒంటరిగా వాహ్యాళికై బయలుదేరేడు. మార్గమధ్యమున తనకు చిరపరిచయుడును, జమరాల్ గ్రామనివాసియునగు, మాధవ్ అనువానినిచూచేడు. ఇరువురూ ఒకరికొకరు నమస్కారములు చేసుకొని కుశలప్రశ్నల కారంభించేరు.

"ప్రఫుల్లబాబూ, చాలదినములై మన గ్రామంవిడచి పెట్టేరు. అప్పటినుండి ఇచ్చటనే యున్నారా?"

"ఆ, చాలా తొందరపను లుంటచే ఇచ్చటనే ఉన్నాను, ఇంకా సుమారు ఒక నెల ఉండవలసి యుంటుంది. మీ రేం పనిమీద వచ్చేరా? మనఊరిలో అంతా క్షేమమా?"

"నేను కోర్టుపనిమీద వచ్చేను. మనవూరిలో అందరూ క్షేమముగానే యున్నారు. ఇంకా రెండు రోజులుఉండి వెళ్లిపోతాను. ఈమధ్య ఒక్కసారైన మనఊరికి వచ్చేరు కారేం? అన్నట్లు మీఅమ్మాయి వివాహానికికూడా రారే."

ఈమాట ప్రఫుల్లునకు పిడుగుపడినట్లైంది. తనువు కంపించింది. తానెక్కడ నున్నది, ఎవరితో మాట్లాడు చున్నదికూడా తెలియలేదు. జనరాల్ గ్రామమంత యు తన కండ్లెదుట కట్టినట్లు కనబడ్డాది. తన కట్టెదుట సువర్ణ మూర్తీభవించింది. భార్య తలంపునకువచ్చింది. ఒడలంతా అగ్నిజ్వాల ప్రజ్వరిల్లింది. ఇంకేమో అడుగ దలచుకున్నాడు గాని నోట మాటరాలేదు.

"ప్రఫుల్లబాబూ, ఏమట్లు తెల్లబోవుచున్నారు? మీకీసంగతి ఇదివరకూ తెలియనట్లున్నదే. పెండ్లిజరిగి అప్పుడే రెండుమాసములు కావచ్చింది."

ప్రఫుల్ లేనిధైర్యము తెచ్చుకొని, గొంతుసవరించి తొట్రుపాటుతో "మాధవ్, నీవు పొరబడుటలేదు కదా? నాకుమార్తె—సువర్ణకు—వివాహమైందా? ఎవరికిచ్చేరు?"

"నే పొరబడుటకు తెలివితప్పియుండలేదు. మీ అమ్మాయి పెండ్లి నేను స్వయముగాచూచేను. భట్టు గ్రామవాసీయగు శ్రీ విలాసునకిచ్చేరు. ఎక రాత్రి పెండ్లి మన జగన్నాథాలయములోనే జరిగింది. మీరు రాకపోతే, ఏమో పనిఉండి రాలేదనుకున్నాము."

ప్రఫుల్లునిమోము జేవురించింది. ప్రతి రక్తనాళం పొంగింది. ఒడలు గుగుర్పొడిచింది. మాటమాటాడక గృహోన్ముఖుడైనాడు.

అప్పటికి ఇంట శశధరబాబు లేడు. ప్రఫుల్లు తన గదిలో ప్రవేశించి మంచముపై పడుకొన్నాడు. మాధవ్ చెప్పిన ప్రతిఅక్షరము జ్ఞప్తికివచ్చింది. యోచనా నిమగ్నుడైనాడు; అప్రయత్నముగా అశ్రువులు రాలుచునే ఉన్నవి.

"నా వరప్రసాది, నా నోములపంట, నాసువర్ణ మరియొకరి సొమ్ము అయింది. నాకింక ఆమెపై ఎవ్విధమైనహక్కు లేదు. అయ్యో! ఎన్ని యోచనలు. కలకత్తా కంపించడం, ఆంగ్లవిద్య నేర్పించడం, అన్నీ మంటగలసేయి. ఆహా! నా చిట్టితల్లి కలకాల మొకరి ఇంట దాస్యము చేయవలసినదేనా? సువర్ణా, సువర్ణా నిన్నెప్పుడైన నాజీవములతో చూడగలుగుదునా? ఈనిర్భాగ్యున కంతటి యదృష్టము కూడానా. నారాయణీ, నీవు భార్యవు కావు. నాపాలిటి బ్రహ్మ రాక్షసివి. నిన్నేమిచేసినను పాపములేదు. నాకంత మున జీవములున్నంతవరకు నీముఖముచూచిన ఒట్టు. నీకిదియే తగినశాస్తి" అని ప్రఫుల్లు డింక నేవియో తనలోతాను, పొంగిపొరలి వచ్చుదుఃఖముతో, వితర్కించుకొనుచున్నాడు. కాని అవి అంత స్పష్టముగా పైకి వినబడలేదు.

ఇట్లెంతసేపు గడచినదో ఆయనకు తెలియదు కాని తిరిగిచూచుసరికి ఆగదిలో హేమాంగి నిలుచున్నది.

"అన్నయ్యా, దేహమస్వస్థతగా నున్నదా? డాక్టరును పిలువనంపేదా?" అని హేమాంగి ప్రశ్నించింది.

"అమ్మా, అక్కరలేదు. నాశరీర మస్వస్థతగా లేదు"

"మరేమట్లున్నారు? మనఊరిలో అంతా క్షేమమేనా? మీరు వచ్చినపనికేమీ అంతరాయము లేదు కద?"

ప్రఫుల్ నోట మరి మాటరాలేదు.

ఇంతలో శశధరబాబాగదిలో ప్రవేశించేడు. ప్రఫుల్లుమొఖరిచూచి దిగ్భ్రమజెందేడు. కారణం భార్యను అడిగేడు. ఆమెకుమాత్ర మేమి తెలియును?

క్రమముగా జరిగినసంగతంతా ప్రఫుల్లు వారుభయులకు చెప్పేడు. "జరిగినదానికై విచారించిన లాభము లేద"ని శశధరుడు, "ఎవరినుదుట బ్రాసినవ్రాత వారనుభవించి తీరవలసినదే"అని హేమాంగి ఓదార్చేరు. ఏదో ఒకరీతిగా ప్రఫుల్లు, శశధరునింట కాలము గడుపుచున్నాడు. ఈమాయసంసారములో కొందటికి రోజనున్న దుఃఖము మరుచటిదినమున ఉండదుకదా!

3

భట్టుగ్రామం భైరవీనది ఆవలఒడ్డున నున్నది. 'జమరాల్ 'కన్న చిన్నపల్లె. శ్రీవిలాసున దండు సామాన్యగృహము. అతడు తండ్రిని బాల్యముననే గోల్పోయెను. నాటినుండి తల్లిచెప్పు చేతల్లో మెలగుచున్నాడు. అతనికి హైమవతి అను సోదరికలదు. శ్రీ విలాసునకిప్పుడు పందొమ్మిదివత్సరములు. అతనికన్నను హైమవతి ఐదువత్సరములు పెద్ద. హైమవతి రజస్వలకాకపూర్వమే వివాహితయై విధవయై పుట్టింట కూర్చుంది. ఆవిడజవ్వనం ఆడవికాయు వెన్నెలే.

శ్రీ విలాసుని వివాహమై సంవత్సరంకావచ్చింది. ఇప్పుడు ఇంటరుమీడియట్ రెండవసంవత్సరం చదువుచున్నాడు. శెలవులలో స్వగ్రామమునకు వచ్చేను.

వాళ్లఆచారప్రకారము సువర్ణ వివాహమైనది మొదలు అత్తవారింటనేయున్నది. అత్తగారి అదలింపులకు హైమవతి అగచాట్లకులోనై రాత్రింబవళ్లు కష్టపడి పనిచేయుచున్నది. ఎంతకష్టపడినను చీవాట్లు తప్పలేదు. పుట్టింటికి,అత్తింటికి, ఆమెకు సహస్రాంశం భేదం కనబడ్డాది. తలంచినది నెరవేర్చుటకు తండ్రీ, అడిగినదిచ్చుటకు అమ్మ, దగ్గరలేరు. ఆమెకు కట్టుబొట్లు మెండు. పుస్తకము ముట్టుకోకూడదు. పగలు పడుకోరాదు. భర్తకు కనబడకూడదట. ఇంటికివచ్చిన ఆసవాంద్రతోకూడా మాట్లాడరాదు. ప్రతీదానికి అత్తగారి అనుమతికావాలి. హైమవతి చాడీలువిని, ఒకటిరెండుసార్లు సువర్ణకు అత్తగారు చేతితోకూడా బుద్ధిచెప్పేరు. నానాటికి సువర్ణకు అత్తవారిల్లన భయం పుట్టింది.

ఒకనాడు మధ్యాహ్నము భోజనానంతరమున సువర్ణ పత్తితో వత్తులుచేస్తుంది. అత్తగారచ్చటనే చాపమీద పండుకున్నారు కాని నిద్రపోలేదు. హైమవతి తల్లిప్రక్కనే కూర్చొని తీర్థయాత్రలమహాత్యం వర్ణిస్తుంది.

"అమ్మా, జగన్నాథం ఏమిటనుకున్నావు? కలియుగవైకుంఠం. మనిషైపుట్టినందుకు జగన్నాథంవెళ్లి స్వామిని దర్శించాలి. అలాంటివాండ్లకు స్వర్గమేకాని నరక మెన్నటికీ లేదు. వట్టిజగన్నాథంచూచి వెళ్లి తే వస్తే చాలదు. సాక్షిగోపాలునిదర్శించి "స్వామీ, నేను జగన్నాథం వెళ్లి వస్తున్నాను, నీవేసాక్షి"అని చెప్పిరావాలి. ఒకవేళ యముడు పొరపాటున, అలాంటివారిని నరకమునకు తీసుకవెళ్తే "ఓయీ; ఈమనిషి జగన్నాథంవెళ్లి స్వామిని దర్శించివచ్చింది, ఇందుకు నేనుసాక్షి; ఈవిడకు స్వర్గానికి హక్కున్నది; విడచిపెట్టు"మని వాదిస్తాడు."

"హైమా, ఇంతవరకెందుకు? కాశీవెళ్లి, గంగానదిలో స్నానంచేసి, విశ్వేశ్వరునిదర్శిస్తే యముడు దగ్గరకురాలేదట."

"అమ్మా, గంగానదివరకు వెళ్తావు. మన భైరవీనది ఏమి తక్కువనుకున్నావా? శ్రీరాములువారు, సీతాలక్ష్మణ సమేతులై దండకారణ్యమునకు వెళ్లేటప్పుడు ఈనదిలో స్నానంచేసి వెళ్లేరట. మనకి దగ్గిరగా ఉండడంవల్ల అశ్రద్ధగానీ, రోజూ ఈనదిలో స్నానం చేస్తే చాలు; కాశీరామేశ్వరాలు వెళ్లనక్కలే."

ఇంతలో ఒకపల్లకీవచ్చి ఆగుమ్మంముందు దిగింది. దానివెంటవచ్చిన మనిషి ద్వారముదగ్గరకువచ్చి "అమ్మా", అని పిలచేడు. సువర్ణ వానినిచూచిన వెంటనే "నందా"అని పిలచింది. నందుడు ప్రఫుల్లబాబు ఇంట చిన్నతనమునుండీ పనిచేయుచున్న సేవకుడు. సుమారు ఏబదివత్సరముల ప్రాయముంటుంది.

"అమ్మా, మీయమ్మగారు నిండా జబ్బుగా ఉన్నారు. కలకత్తాకు వెళ్ళి గ్రామము వస్తే మీతండ్రిగారు ఆరోజు ఉదయమునకే వచ్చేరు. వైద్యులను తెప్పించి చూచేరు. గాని బ్రతుకుతుందని ఆశ ఎవ్వరికీ లేదు. ఇంట ఆడదక్షత లేదని చోరబిల్లి నుండి చిన్నమ్మగారు కూడా వచ్చేరు. మీకు అత్తగారు విడువరని ఇంతవరకూ కబురుపంపలేదు. వస్తే మొగము చూస్తారని, బాబుగారు పన్నా పల్లకీని పంపించేరు. అమ్మగారికి తెలివివచ్చి నప్పుడెల్లా "నాచిట్టితల్లి వచ్చిందా" అని అడుగు చున్నారు." అని అంగవస్త్రముతో కండ్లనీళ్లను తుడుచుకున్నాడు.

సువర్ణకీమాటలు మిన్నువిరిగి మీదపడినట్లయింది. నిలువున కూలబడ్డది. "అమ్మా, అమ్మా" అని భోరున ఏడ్చింది.

"ఇదేమిటే, పిల్లలతో వున్న ఇంట్లో పీనుగపోయిన ట్లేడుస్తావు. నోరుముయ్యి, లేదా నోటిమీద వాత పెయ్యగలను. ఎక్కడో దీనమ్మకు జ్వరమట, నిండు ఇంట్లో ఏడుస్తుంది." అని అత్తగారు నిప్పుత్రొక్కిన కోతివలె గంతెయ్యడం మొదలెట్టేరు.

"ఇదొక్కడి చోద్యమమ్మా? రోగాలు మనుష్యులకురాక మ్రానులకు వస్తాయా? జబ్బు వచ్చిన వాళ్లంతా చచ్చిపోతారా? లోకంలో ఈవిడకే తల్లివున్నట్లు ది, మరెవ్వరూ తల్లికడుపున పుట్టలేదు" అని ఆడపడుచు ఆడిపోసింది.

పాపం సువర్ణ అడకత్తెరలోని పక్క. ఇంతదుఃఖము దిగమ్రింగి దీనదృష్టి నందునివంక చూచింది. నందుడు నిశ్చేష్టుడై నోట మాటలేక శిలాప్రతిమవలె నిలుచున్నాడు.

"పోరా, నీకెందుకిక్కడ సాతానిశవములాగ. ఆపిల్ల రావడానికివీలులేదు. పో," అని అత్తగారు నందుని తుళ్లగొట్టేరు. చేయునదిలేక, సువర్ణ యను మతినిగాని నందుడు పల్లకిని తిరిగితీసుక వెళ్ళిపోయాడు.

శ్రీవిలాసుడు ఇంతసేపూ ప్రక్కగదిలోనే ఉండి ఈవాగ్ధోరణిఅంతా వింటున్నాడు, కాని ఏమిచేయ గలడు? తల్లిచేతి కీలుబొమ్మ.

రాత్రి భోజనానంతరమున ఎవరిగదులలోనికి వారు వెళ్ళి నిద్రపోయేరు. సువర్ణ అత్తగారిభయము కొలదీ విస్తరికూర్చొని లేచింది. ఒక్కకబళమైనను భక్షించిన పాపాన పోలేదు.

రాత్రి పన్నెండు గంటలయింది, అంతటా నిశ్శబ్దము. చిమ్మచీకటి. కన్నుమూసినను తెరచినను ఒక్కలాగే ఉంది. శ్రీవిలాసునిఇంట సువర్ణతక్క తక్కిన అందరికీ నిద్రాదేవి ఆవేశమయింది. సువర్ణ తల్లిని తలంచుకొనుచూ ఇంకనూ ఏడ్చుచునే ఉన్నది. ఆవిడకు తల్లి కంటికి కట్టినట్లుగా కనుపించుచున్నది. "రా, రమ్మని" పిలుచుచున్నట్లు తోచుచున్నది. సువర్ణ సందిగ్ధావస్థలో చిక్కుకున్నది; అత్తగారిఆజ్ఞ ఉల్లంఘించి వెళ్ళిపోవడమా? తల్లి మొగము చూడకుండా ఉండడమా?

ఎట్టకేలకు "అమ్మా, అమ్మా, నీముఖము చూడక ఉండలేను" అనిఏడ్చుచు మంచముపైనుండి దిగ్గున లేచింది. ఇంచుకైనను శబ్దముచేయక తలుపు తెఱచు కొని వీధిబడినది. ఆమెకు మనస్సు స్వాధీనముతప్పినది. అప్రయత్నముగా కాళ్లు తీసుకొనిపోవుచున్నవి. తిరిగి వచ్చిన అత్త చీల్చిచెండి వేయునని తెలిసి, అర్ధరాత్ర మున స్వైరవీధిని దాటుట ప్రమాదకరమని ఎఱింగి, ఏమి ఈసువర్ణసాహసము!

(సశేషము)